
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
బుధవారం 29 అక్టోబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	34,663	33,283
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	2,964.38	2,964.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.192 (40.0706)	42,330	57,477

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260



మాడ్గులపల్లి మండలంలో నేలకొరిగిన వరి

రైతుల్లో మొంథా గుబులు

జిల్లాలో ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు నష్టపోతున్న సమయంలో మొంథా తుపాన్ తోడైంది. తుపాన్ ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచే జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు మోస్తరుగా వర్షాలు కురుస్తు న్నా, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయ ని వాతావ రణశాఖ ప్రకటించింది. దీం తో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ)

రాష్ట్రానికి సరిహద్దులోని ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తుపాన్ ప్రభావంతో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతానికి జిల్లాలో భారీ వర్షాలు లేకున్నా, బలంగా వీస్తున్న ఈదురు గాలులకు వరిచేలు నేలకు ఒరుగుతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 41వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. సీసీఐ ఇప్పటి వరకు 1,000క్వింటాళ్లకు మించి పత్తి కొనుగోలు చేయలేదు. ఐకేపీ కేంద్రాలను అనువుగా లేని చోట ఏర్పాటుచేయడంతో వర్షాలు కురిసినప్పుడు ధాన్యం వరదకు కొట్టుకుపోతోంది. దీంతో కొనుగోళ్లకు ఆటంకం కలుగుతోంది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వరి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాలతో తేమ సమస్య కూడా అధికమైంది. వరితో పాటు పత్తిలో తేమశాతం పెరిగి కొనుగోళ్లకు నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

- నేలవాలిన వరి చేలు
- తడిసి ముద్దవుతున్న పత్తి
- ధాన్యం, పత్తి కొనుగోళ్లకు ఆటంకాలు
- ఆందోళనకు గురవుతున్న రైతులు

నష్టపోతున్న రైతులు

తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మిర్యాలగూడ డివిజన్‌లో 15 వేల ఎకరాలకు పైగా వరి నేలకు ఒరిగింది. ఇప్పటికే గత నెల నుంచి కురుస్తున్న అడపాదడపా వర్షాలకు ఎత్తుగా పెరిగిన వరిచేలు గాలివానకు నేలవాలి పోతున్నాయి. మరో 10 నుంచి 15 రోజుల్లో కోతకు రావాల్సిన వరిచేలు ఒరిగిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట నోటికాడికి వచ్చే ముందు నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రిపురారం మండలంలో తుపాన్ ధాటికి వరిచేలు ఒరిగాయి. మర్రిగూడ మండలం తానేదార్‌పల్లి గ్రామంలో వరి నేలవాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. అనుముల మండలం సాగర్ ఎడమ కాల్వ కింద వరిపొలాలు ఏపుగా పెరగడంతో గాలికి, వానకు నేలకొరుగుతున్నాయి. చింతపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పత్తి చేలల్లో వర్షపు నీరు నిలిచింది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు ...

- మిగతా 8వ పేజీలో...

ఇష్టపడి చదివితే సులభంగా ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి భీమ్‌సింగ్



సాగర్ హైలాన్ కాలనీలో విద్యార్థి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్

హాలియా, నాగార్జునసాగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివితే సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి భీమ్‌సింగ్ అన్నారు. మంగళవారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫేస్ రికగ్నేజేషన్ యాప్‌లో ప్రతీ విద్యార్థి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలతో కూడిన హామీపత్రాన్ని తీసుకోవాలని సూచించారు. నవంబరు నుంచి ప్రతీ కళాశాలకు డిజిటల్ బోర్డులు అందజేస్తామని, వాటి ద్వారా ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులు ప్రసారం అవుతాయన్నారు. సాగర్‌లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాళ్లు జాకిర్ హుస్సేన్, రాజశేఖర్, అధ్యాపకులు ఆదిరెడ్డి, బాలరాజు, వెంకట్‌నాయక్, హరికృష్ణ, సంజీవరెడ్డి, లింగమూర్తి, సతీష్ చంద్ర, వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, ఉపేంద్రాచారి, గోపాలకృష్ణ, మాధురి, సైదమ్మ, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల, అధ్యాపకుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఫేస్ రికగ్నిజేషన్ అమలు తీరును తనిఖీ చేశారు. ఉన్నత ప్రమాణాలు, నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆదేశించారు. కళాశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలించారు. మౌలిక వసతులపై విద్యార్థులను అడిగారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

పత్తి రైతు కంట తేమ

- పత్తి కొనుగోళ్లలో జాప్యం
- రాయిగిరి-మోత్కూరు రహదారిపై ధర్నా
- గంటలపాటు రైతుల ఆందోళన

7



నకిరేకల్-అర్వపల్లి జాతీయ రహదారిపై పత్తిని దహనం చేసి ధర్నా చేస్తున్న రైతులు

మత్తే ముంచుతోంది



హైవేల వెంట బెల్ట్ దుకాణాలు ప్రమాదాలకు కారణమవుతున్న మద్యం మత్తు పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు

రోడ్డు ప్రమాదాలకు మద్యం మత్తు ప్రధాన కారణంగా ఉంటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జాతీయ రహదారుల వెంట సమయపాలన లేకుండా నిరంతరం మద్యం లభిస్తోంది. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిపై సూర్యాపేట, చిట్యాల, మునగాల ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలు మూసిన అనంతరం రాత్రి 10 గంటల తర్వాత బెల్ట్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అధిక ధరలు తీసుకుంటున్నా మద్యం ప్రియులు కొనుగోలు చేసి సేవిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతూనే, ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ తరహా ఘటనల్లో మృతుల్లో ఎక్కువగా యువకులే ఉంటున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మారిపోతున్నారు. బెల్ట్ దుకాణాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీస్‌శాఖల పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

6

అవినీతికి పాల్పడితే సమాచారం ఇవ్వాలి

ఏఎస్పీ బి.ప్రతాప్‌కుమార్



అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో అవినీతి, అక్రమాలు జరిగినా, నిధులు దుర్వినియోగానికి పాల్పడినా టోల్‌ఫ్రీ నెంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాంతీయ నిఘా అమలు అధికారి, ఏఎస్పీ బి.ప్రతాప్‌కుమార్ సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజిలెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, విజిలెన్స్ అధికారులు కె.ఇందిరా, ఎస్‌కే.గౌస్, సింగం నాగరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

టాప్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

నల్లగొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం నల్లగొండ డివిజన్ మహాసభల్లో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టాప్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ లింగా అరుణ మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్లను, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎస్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, కోశాధికారి ఎండీ.అబ్దుల్‌ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాఫెల్, వై.సత్తయ్య, రాధారపు భిక్షపతి, పాల్గొన్నారు.

● నల్లగొండ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిట్టిపోలు భిక్షమయ్య, అధ్యక్షుడిగా గుండాల భిక్షమయ్య, ప్రధాన కార్యదర్శిగా చేపూరి పరశురాములు, ఉపాధ్యక్షులుగా కొమ్మారెడ్డి రాయపురెడ్డి, ఏశాల జయలక్ష్మి, సామఅంజిరెడ్డి, కోశాధికారిగా రాపోలు వెంకటేశం, కార్యదర్శులుగా సావిత్రి పటాలే, పెండెం విజయకుమారి, మౌలానా అస్కర్, రచ్చ సూర్యనారాయణ, ఆడిట్ కన్వీనర్‌గా వనమా నరసింహ ఎన్నికయ్యారు.

ఇదీ బంగారమేనండోయ్..

- 9క్యారెట్ల బంగారానికి పెరుగుతున్న డిమాండ్
- వెండికి బదులు ఆసక్తి చూపుతున్న వినియోగదారులు

7

విడతల వారీగా ధాన్యం తెచ్చేలా అవగాహన కల్పించాలి



నకిరేకల్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లకు వర్షాలు సవాల్‌గా మారాయని, ఒకేసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రైతులు విడతల వారీగా ధాన్యాన్ని తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లుల్లో ఇబ్బంది ఉండదనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. వరి కోతల ఆధారంగా వ్యవసాయశాఖ షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఒకేసారి వరి కోతలు జరగకుండా డివిజన్ల వారీగా హార్వెస్టర్ల యజమానులతో సమావేశాలు నిర్వహించామన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో సన్నధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున మిల్లుల వద్ద ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని మిల్లర్లు ఎలాంటి సమస్యలు సృష్టించవద్దని కోరారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు, జిల్లా యంత్రాంగానికి, మిల్లర్లకు ఇబ్బందులు కలగకుండా పోలీస్‌శాఖ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. ఒకేసారి ధాన్యం రాకుండా అవసరమైతే టోకెన్లు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, రాజశేఖర్‌శర్మ, డీసీవో పత్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, డీఎం గోపికృష్ణ, జేడీఏ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కట్టంగూరు, నకిరేకల్): తుపాన్‌తో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం కట్టంగూరు మండలంలోని అయిటిపాముల, కట్టంగూరు, నకిరేకల్‌లోని చీమలగడ్డ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డితో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దే ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 17శాతం లోపు వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మొంథా తుపాన్ తగ్గే వరకు రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావద్దన్నారు. లారీల కొరత, మిల్లర్ల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట కట్టంగూరు, నకిరేకల్ తహసీల్దార్లు పుష్పలత, యాదగిరి, ఉన్నారు.

ఎల్ఐసీ సొమ్ము అదానీకి ధారాదత్తం

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉన్న రూ.33వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును సంక్షోభంలో ఉన్న ఆదానీ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూల వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం వేదికగా డిసెంబరు 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని తరలిరావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వేళ్లూనుకుంటోంది

- ప్రమాదం అంచున మూసీ వంతెన
- వంతెన పక్కనుంచి పెరిగిన మొక్కలు

7

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో రామాపురం క్రాస్‌రోడ్డు నుంచి కొమరబండ వరకు ప్రతీ గ్రామంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి సమీపంలోనే నాలుగు నుంచి ఐదు బెల్ట్‌దుకాణాలు నడుస్తున్నాయి. కొంతమంది హైవేను ఆనుకునే దుకాణం ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. కొమరబండ బైపాస్, దుర్గాపురం బైపాస్(అశోక్‌నగర్), అశోక్ లేల్యాండ్ షోరూం పక్కన, దోరకుంట ఇండస్ట్రియల్ పార్క్ పక్కన, చిమిర్యాల క్రాస్‌రోడ్డు, నల్లబండగూడెం, రామాపురం క్రాస్‌రోడ్డులో బెల్టుషాపులు జోరుగా నడుస్తున్నాయి. సుమారు 25కి పైగా దుకాణాలు ఉండగా రాత్రి 11 గంటల వరకు వీటిని నిర్వహిస్తున్నారు.



మత్తే... ముంచుతోంది

- హైవేల వెంట విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు
- ప్రమాదాలకు కారణమవుతున్న మద్యం మత్తు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు

అమ్మో హైవే-1

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)

ఇటీవల నడిగూడెం మండలం నుంచి వ్యవసాయ కూలీలతో జగ్గయ్యపేటకు వెళ్లిన ఆటో తిరిగి వస్తోంది. చిమిర్యాల క్రాస్‌రోడ్డు వద్ద బోల్తాపడింది. అంతకుముందే డ్రైవర్ రామాపురం క్రాస్‌రోడ్డులో మద్యం తాగి వాహనం నడిపినట్లు ప్రయాణికులు తెలిపారు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ మద్యం తాగడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నుంచి ఇరువురు ద్విచక్రవాహనంపై కోదాడ మండలం చిమిర్యాల క్రాస్‌రోడ్డుకు వచ్చారు. అక్కడున్న బెల్ట్ దుకాణంలో మద్యం తాగారు. దుర్గాపురం బైపాస్ వద్దకు రాగానే మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడపడంతో అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరికీ తీవ్రగా

సర్వీసు రోడ్డు వెంటే....

(ఆంధ్రజ్యోతి-మునగాల): సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంతో పాటు సర్వీసు రోడ్డులో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారికి మీటర్ల దూరంలోనే ఇవి నిర్వహిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఏడు నెలల కిందట సర్వీసురోడ్డులోని బెల్ట్ దుకాణంలో మద్యం ఆ మత్తులోనే తాగి ద్విచక్రవాహనంతో హైదరాబాద్-విజయవాడ రహదారిని దాటేందుకు ప్రయత్నించాడు.ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

యాలయ్యాయి.

అర్ధరాత్రి వరకు విక్రయాలు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటరూరల్) : సూర్యాపేట మండలంలో బెల్ట్ దుకాణాలు అర్ధరాత్రి వరకు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా మద్యం దుకాణాలు మూసివేశా క ఈ దుకాణాల వద్ద జనం కిటకిటలాడుతున్నారు. సూర్యాపేట మండలంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారికి సమీపంలోని జనగాం క్రాస్‌రోడ్డు, పిల్లలమర్రి స్టేజీ, రాయినిగూడెం బిహార్ దాబా, టేకుమట్ల, అదేవిధంగా ఖమ్మం-సూర్యాపేట(365 బీబీ) సమీపంలోని గాంధీనగర్, బాలెంల, యర్కా రం స్టేజీల్లో బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. ఇటీవల సూర్యాపేట మండలంలోని కుసుమవారిగూడెం వద్ద యువకుడిని దారుణంగా హత్య చేసిందీ కూడా బెల్ట్ దుకాణంలోనే. మద్యం తాగుతున్న క్రమంలోనే ఈ హత్య జరిగింది. జాతీయ రహదారుల వెంబడి ఉన్న దాబాల్లో మద్యం ప్రియుల కోసం ప్రత్యేకంగా సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడుతున్నారు.

చిట్యాల పరిధిలో నాలుగుచోట్ల


(ఆంధ్రజ్యోతి-చిట్యాల రూరల్): నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి సమీపంలో రెండు గ్రామాల్లో నాలుగు చోట్ల బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. పెద్దకాపర్తిలో సర్వీసు రోడ్డులో మూడు ఉండగా, హైవేకు 60 అడుగుల దూరంలో ఒకటి ఉండగా రాత్రి 10గంటల వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అదేవిధంగా పెద్దకాపర్తి, వెలిమినేడులలో హైవేకు సమీపంలోనే మూడు బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. స్థానికులతో పాటు రహదారిపై వెళ్లే వారు కూడా మద్యం కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ బెల్ట్ దుకాణం కొనసాగుతున్నట్లు ఎక్సైజ్, పోలీసుశాఖకు సమాచారమున్నా ఎలాంటి చర్యలు లేవు. ఏదేని సంఘటనలు జరిగిన సమయంలో తప్ప బెల్టు దుకాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

మద్యం మత్తులోనే...



(ఆంధ్రజ్యోతి-బీబీనగర్): యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో విస్తరించిన హైదరాబాద్-భూపాలపల్లి(163) జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో మద్యం మత్తులో జరిగినవే ఎక్కువగా పోలీసులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో ఈ ఏడాదిలో 34 రోడ్డు ప్రమాదాలు జరగ్గా ఎక్కువ శాతం మద్యం తాగి వాహనాలు నడపడం వల్లేనని పోలీసులు తెలిపారు. ఈ రహదారి గుండానే అటు యాదాద్రి క్షేత్రానికి, స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు భువనగిరి శివారులో హైవేను ఆనుకుని ఉన్న ప్రసిద్ధి రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ప్రతీ మంగళవారం శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. తిరిగి సాయంత్రం స్వస్థలాలకు వెళ్లే క్రమంలో మార్గమధ్యలో మద్యం తాగి వాహనాలు నడపటంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.

చౌటుప్పల్ పరిధిలో కానరాని బెల్ట్ దుకాణాలు



చౌటుప్పల్ రూరల్ : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బెల్ట్‌దుకాణాలు లేవు. మునుగోడు నియోజకవర్గ పరిధిలో బెల్ట్ దుకాణాలను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిషేధించడంతో హైవేపై బెల్ట్ దుకాణాలు నిర్వహించడం లేదు. గుండ్లబాయి, కొన్ని ప్రాంతాలలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న దాబాలలో మద్యం బయట కొనుగోలు చేసుకొని బహిరంగంగా ఉదయం నుంచి రాత్రి వరకు సేవిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం): ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కొనసాగుతున్నాయి. తర్వాత తెల్లవార్లు బెల్ట్ దుకాణాల్లో కావాల్సిన మద్యం లభిస్తోంది. సూర్యాపేటలో హైదరాబాద్-విజయవాడ(65) జాతీయరహదారికి ఆనుకుని, సమీపంలో అనేక బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలు మూసివేసిన తర్వాత హైవే వెంట వెళ్లే వాహన డ్రైవర్లు, ప్రయాణికులు, యువత ఈ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేస్తూ, కొంతమంది అక్కడే తాగుతున్నారు. ఆ మత్తులో ప్రయాణం చేస్తూ రోడ్డు ప్రమాదాల బారిన

బెల్ట్ దుకాణాల్లో తెల్లవార్లూ విక్రయాలు

పడుతున్నారు. అదేవిధంగా మద్యం మత్తులో యువత ఘర్షణలకు పాల్పడుతున్నారు. జాతీయ రహదారి వెంట బెల్ట్ దుకాణాలు కొనసాగుతున్నా పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. మిగతా రోజుల్లో బెల్టు దుకాణాలపై దాడులు చేసిన దాఖలాలు లేవు. సూర్యాపేట పరిధిలో జనగాం క్రాస్ రోడ్డు, వ్యవసాయ మార్కెట్ ప్రాంతం, రాజీవ్‌పార్కు, దురాజ్‌పల్లి వద్ద మద్యం బెల్టు దుకాణాలు ఉన్నాయి.

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చర్యలు



హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటాం. రాత్రివేళ మద్యం తాగి వాహనాలు నడిపే వారిని బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షిస్తున్నాం. ఇప్పటికే అనేకమందిపై జరిమానాలు, కేసులు నమోదు చేశాం. బెల్ట్ దుకాణాల నిర్వాహకులు ఇరువురిపై కూడా కేసులు నమోదు చేశాం. రాత్రి వేళ పోలీస్ గస్తీని రామాపురం క్రాస్‌రోడ్డు వరకు నిర్వహిస్తున్నాం.

- గోపాల్‌రెడ్డి, కోదాడ రూరల్ ఎస్‌ఐ

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కేసులు

బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే కేసులు తప్పవు. ఇటీవల జనగాం క్రాస్‌రోడ్డులోని బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న ఇద్దరికి, కుసుమవారిగూడెంలో ఐదుగురికి, గాంధీనగర్‌లో ఇద్దరిపై కేసులు నమోదు చేశాం. బెల్ట్‌దుకాణాలు నిర్వహిస్తున్నట్లు పోలీసుల దృష్టికి తీసుకువస్తే వెంటనే కేసులు నమోదు చేస్తాం.

- బాలునాయక్, ఎస్‌ఐ సూర్యాపేట రూరల్

మద్యం ఇతర ప్రాంతాల్లో విక్రయించొద్దు

ప్రభుత్వం కేటాయించిన దుకాణాల్లోనే మద్యం విక్రయించాలి. ఇతర ప్రాంతాల్లో ఎక్కడా మద్యం విక్రయించొద్దు.జాతీయరహదారి పక్కన హోటళ్లు, ఇతర దుకాణాల్లో ప్రత్యేకంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

- పద్మ, ఎక్సైజ్ సీఐ, చండూరు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

కట్టంగూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో మనస్థాపానికి గురైన ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ రవీందర్, బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అయిటిపాముల గ్రామానికి చెందిన సంగిశెట్టి శేఖర్(65) భార్య పద్మకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలయ్యాయి. కుమారులు నల్లగొండలోని ఆర్జాలబావి వద్ద మగ్గం నేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రెండేళ్ల కిందట భార్య పద్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కుమారులతో కలిసి ఆర్జాలబావిలో ఉంటున్నారు. భార్య మృతితో ముభావంతో ఉంటూ తాగుడుకు బానిసయ్యాడు. 10 రోజుల కిందట పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని కుమారులకు చెప్పి స్వగ్రామానికి వచ్చాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు విచారించారు. అయినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా మంగళవారం గ్రామశివారులోని శ్మశానవాటికలోని గదిలో ఉరివేసుకుని ఉండగా స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శేఖర్ కుమారుడు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మునుగోటి రవీందర్ తెలిపారు.

మృతదేహం లభ్యం



చంద్రపాల్(ఫైల్)

భువనగిరి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన వ్యక్తి మృతదేహం 10వ రోజున లభించింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన ఇట్టబోయిన చంద్రపాల్ ముదిరాజ్(50) ఈ నెల 19న పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పరిసరాలలో వెతికి మరుసటి రోజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం బైపాస్ రోడ్డు వెంట గల గుంతలలో పడి ఉన్న మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించి పరిశీలించగా చంద్రపాల్ మృతదేహంగా నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా పరిగణిస్తూ దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం రమేష్ తెలిపారు. చంద్రపాల్‌కు భార్య ఉండగా పిల్లలు లేరు.

మునుగోడులో బిట్‌కాయిన్ పేరుతో మోసం

- రూ.కోటికి పైగా వసూలు
- లబోదిబోమంటున్న బాధితులు

మునుగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బిట్‌కాయిన్‌లో పెట్టుబడికి రెట్టింపు డబ్బు వస్తుందని ఆశ చూపిన ఓ మొబైల్ వ్యాపారి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల చొప్పున మొత్తం రూ.కోటికి పైగా వసూలు చేసి కనిపించకుండాపోయాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మునుగోడులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మునుగోడులో కొన్నాళ్లుగా ఓ మొబైల్ దుకాణం నిర్వహిస్తూనే బ్యాంక్‌కు అనుబంధంగా ఆర్థిక లావాదేవీలు నడుపుతూ జీవనం సాగిస్తుండేవారు. ఈ క్రమంలో ప్రజల అమాయకతను ఆసరాగా చేసుకొని వారిని నమ్మించేందుకు ప్రయత్నించాడు. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.10వేలు లెక్కన 20 నెలలకు రెండింతల డబ్బు వస్తుందని ఆశచూపాడు. పెట్టుబడి పెట్టిన కొందరికి చెప్పిన ప్రకారం నెలవారీగా డబ్బు చెల్లిస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని మరికొందరికి తెలిపి మరికొందరిని మాయమాటలతో బురిడీకొట్టించాడు. ఒక్కొక్కరు రూ.లక్షకు బదులుగా రూ.5 నుంచి రూ.6లక్షలు ఆపైనే పెట్టుబడి పెట్టారు. ఇలా 20 మందికి పైగా పెట్టుబడి పెట్టగా అందులో అధికంగా మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే కొన్నిరోజులుగా సదరు వ్యక్తి కనిపించకుండా పోయాడు. దీంతో బాధితులు అతడి కోసం ఆరా తీసినా ఆచూకీ తెలియలేదు. తాము మోసం చేశాడని గ్రహించి లబోదిబోమంటున్నారు. ఈ వ్యవహారంలో పెట్టుబడి పెట్టి ఇంట్లో ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడ్డారని, ప్రధానంగా భర్త చాటుగా భార్యలు సైతం పెట్టుబడి పెట్టిన వారిలో ఉన్నట్లు సమాచారం. మూడు రోజుల కిందట మునుగోడుకు వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని బాధితులు ఆశ్రయించారు. తాము మోసపోయామని గోడు వెల్లబోసుకున్నారు. తమను మోసం చేసిన బాధ్యుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని, డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన స్పందించిన ఎమ్మెల్యే పోలీసులను ఆదేశించారు. అనంతరం పోలీసులకు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా బాధితులు ఫిర్యాదు చేసినమాట వాస్తవమేనని, పరిశీలిస్తున్నామని, త్వరలో కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో జోరుగా మట్టి తవ్వకాలు



ప్రభుత్వం భూమిలో ఎక్స్‌కవేటర్లతో చేపడుతున్న మట్టి తవ్వకాలు

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)

సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో అనుమతులు లేకుండా రాత్రివేళల్లో ప్రభుత్వ భూమిలో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి టిప్పర్లలో రాత్రివేళ కోదాడలోని వెంచర్లకు తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కోదాడకు దగ్గరలోని సమీప గ్రామాలైన గుడిబండ, కాపుగల్లు, తొగర్రాయి, కొమరబండ, దోరకుంట గ్రామాల్లో పెద్దఎత్తున మట్టిని తరలిస్తున్నారు. వాహనాల శబ్ధాలతో రాత్రివేళ నిద్రపట్టడం లేదని, మట్టి తవ్వకాలు ఆపాలని కాపుగల్లు గ్రామస్థులు తహసీల్దార్‌కు ఇటీవల ఫిర్యాదుచేశారు. రాత్రి వేళ మట్టిని తరలించి డంప్‌గా ఏర్పాటు చేస్తున్నారని, అక్కడి నుంచి ఉదయం ట్రాక్టర్ల ద్వారా కావాల్సిన వారికి విక్రయిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. కాపుగల్లు గ్రామంలో వందల ఎకరాల్లో ప్రభుత్వ భూమి ఉందని, పెద్దపెద్ద గుట్టలు ఉన్నాయని పశువులు, మేకలు మేపుకునేందుకు అనువుగా ఉండేదని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం గుట్టలను పెకిలించి మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల గుడిబండ గ్రామంలో గ్రామస్థులు మట్టి తవ్వకాలను అడ్డుకున్నారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వ్యాపారులను నిలదీశారు. తాము ప్రభుత్వం నిర్మిస్తున్న రోడ్లకు మాత్రమే మట్టిని తరలిస్తున్నామని, బయట ఎటువంటి విక్రయాలు చేయడంలేదని బదులిచ్చారు. కానీ అందుకు విరుద్ధగా పెద్దఎత్తున మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వ్యాపారులు కొందరు సంబంధిత అధికారులతో కుమ్మక్కు కావడం వల్లే వారు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు



మైనింగ్‌శాఖ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు ఏ ఫిర్యాదు రాలేదు.

- గోపాల్‌రెడ్డి, కోదాడ రూరల్ ఎస్‌ఐ

వీధికుక్కల దాడిలో మేకపిల్లలు మృతి



కోదాడ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో వీధికుక్కల దాడిలో మేకపిల్లలు మృత్యువాత పడ్డాయి. కాపుగల్లు గ్రామానికి చెందిన రైతు పిట్టల పుల్లయ్యకు చెందిన మేకలను దొడ్డిలో కట్టివేయగా, వీధికుక్కలు దాడి చేశాయి. దాడిలో ఆరు మేకపిల్లలు మృతి చెందడంతో సుమారు రూ.30 వేల నష్టం వచ్చిందని రైతు తెలిపారు. జీవాలపై ఆధారపడిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

నల్లగొండలో బాలుడికి గాయాలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డు కేశరాజుపల్లిలో పిచ్చికుక్కలు స్వైర్యవిహారం చేశాయి. మంగళవారం పలువురిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కాలనీకి చెందిన ఏడేళ్ల బాలుడిని పిచ్చికుక్కలు కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆ బాలుడికి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. కుక్కలను నివారించి కాపాడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి

పాలకవీడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెంలో మంగళవారం లారీ ఢీకొని ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు ముక్క అబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా వేములపల్లి మండల రావులపెంట గ్రామానికి చెందిన నలుగురు గొర్రెలకాపరులు మూడు నెలల కిందట పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామపరిధిలోని అటవీ భూమిలో 250 గొర్రెల మందతో మేతకు వచ్చారు. తిరిగి మంగళవారం ఉదయం జాన్‌పహాడ్ అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన గొర్రెల మంద పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామపరిధిలోకి వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ గొర్రెలమందను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. పలు గొర్రెలకు గాయాలయ్యాయి. దీంతో యజమాని ముక్క అబ్బయ్యకి సుమారు రూ.లక్షన్నర నష్టపరిహారం వాట్లింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కోటేష్ తెలిపారు.

అనుమతి లేకుండా పేరు మార్చారు



ధర్నా చేస్తున్న వెంకమ్మ

హుజూర్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తన అనుమతి లేకుండా తన పేరు మీద ఉన్న ఇంటిని కోడలి పేరు మీదకు మార్చారని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఓ వృద్ధురాలు ఆందోళన నిర్వహించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌లోని కనకదుర్గ దేవాలయం వీధిలోని దొంతిరెడ్డి సీతారాంరెడ్డి ఇంటిని 2019లో ఆమె భర్త వెంకమ్మ పేరు మీదకు మార్చారు. వీలునామాలో కూడా ఆమె పేరే మీదే ఉంది. 2022లో సీతారాంరెడ్డి మృతి చెందాడు. అనంతరం అధికారులు ఆ ఇంటిని కోడలు దొంతిరెడ్డి లక్ష్మి పేరు మీదకు మార్చారని వెంకమ్మ తెలిపింది. ఈ విషయాన్ని ఆర్టీఐ ద్వారా తెలుసుకుని అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా పట్టించుకోలేదన్నారు. తన అనుమతి లేకుండా కోడలు పేరు మీదకు మార్చి తనకు అన్యాయం చేర్చారని తెలిపారు. ఈ విషయంపై మునిసిపల్ అధికారులు సమగ్ర విచారణ చేసి తన పేరు మీదకు ఇంటి నెంబర్ మార్చాలని వెంకమ్మ అధికారులను డిమాండ్ చేశారు. కాగా ఈ విషయంపై విచారణ చేసి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించింది.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 27: గ్రామాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామకార్యదర్శి, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం అధికారులకు ఫిర్యాదుచేశారు. పంచాయతీ బోరుమోటరు, వీధిలైట్లు, కరెంటు మీటర్లను ఉద్దేశపూర్వకంగా తగులబెడుతున్నారని, ఈ సంఘటనలపై విచారణ నిర్వహించాలని ఏసీపీ మధుసూదన్ రెడ్డికి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల మల్లేష్‌యాదవ్, గ్రామస్తులు మునగాల మల్లారెడ్డి, కొలను ఆగిరెడ్డి, జంగయ్య, సత్తిరెడ్డి, కొంతం శ్రీనివాస్ రెడ్డి, సామ రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కట్ట శంకర్యలు పాల్గొన్నారు.

రికార్డులు అప్పగించకపోవడంతో ఇబ్బందులు

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డీపీవో కార్యాలయానికి అటాచ్ అయిన కార్యదర్శి కొత్తకార్యదర్శికి రికార్డులు ఇవ్వకపోవడంతో నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామకార్యదర్శి గాయత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ నెల 13న డీపీవో కార్యాలయానికి అటాచ్ చేశారు. అయితే కొత్తగా బాధ్యతలు తీసుకున్న గ్రామకార్యదర్శికి ఎలాంటి రికార్డులు ఇవ్వకుండా బీరువా తాళాలు తీసుకుని వెళ్లినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో రోజువారి పనుల నిర్వహణకు తీవ్రఇబ్బంది కలుగుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి



అశోక్(ఫైల్)

మాడ్గులపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కాసాని అశోక్(38) తిప్పర్తి మండల కేంద్రంలోని రైస్‌మిల్లులో మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ పనినిమిత్తం ఈనెల 21న నల్లగొండకు బైక్‌పై వెళ్లి పని ముగించుకుని తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. తిప్పర్తి మండలంలోని మల్లెపల్లి వారిగూడెం గ్రామశివారులోకి రాగానే అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై ట్రాక్టర్ ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం గోపాలపురం గ్రామంలో అశోక్ అంత్యక్రియలు నిర్వహించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఈ ప్రమాదంపై తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

లక్కీడ్రాలో మాడ్గులపల్లి మద్యం దుకాణం

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మద్యం టెండర్లలో మిర్యాలగూడ డివిజన్‌లోని మాడ్గులపల్లి 63వ నెంబర్ గల మద్యం దుకణానికి అశోక్ దరఖాస్తు చేశాడు. ఈ నెల 27న నిర్వహించిన లక్కీడ్రాలో దుకాణం ఆయనకు దక్కింది. ఆ విషయం తెలియకుండానే అశోక్ మృతి చెందాడు. ఎన్నోఆశలతో పైసాపైసా కూడబెట్టిన డబ్బుతో మెరుగైన జీవనోపాధి పొందాలన్న ఉద్దేశ్యంతో మద్యం టెండర్‌లో పాల్గొన్న అశోక్ ఆశలు తీరకముందే చనిపోవడం స్థానికులను కంటతడి పెట్టించింది.

తుపాన్ ప్రభావంతో మారిన వాతావరణం

- చల్లటి ఈదురుగాలులు
- వృద్ధులు, చిన్నారులు అవసరమైతేనే బయటకు రావాలి : వైద్యులు




చౌటుప్పల్ లోని ఐకేపీ కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతు

భువనగిరి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపానుతో వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవల వరకు కురిసిన వరుస వర్షాల అనంతరం వాతావరణ ఉష్ణోగ్రత పెరుగుతున్న క్రమంలో తుపానుతో మరోసారి వాతావరణం చల్లబడింది. దీంతో యాదాద్రిభువనగిరి జిల్లాలో చల్లటి గాలులు వీస్తున్నాయి. అలాగే పలు ప్రాంతాలలో మంగళవారం ఓ మోస్తారు వర్షాలు కూడా కురిసాయి. శుక్రవారం వరకు తుఫాన్ ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. తుపాను కారణంగా రెండు రోజుల క్రితం రాష్ట్రానికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసి యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలలో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి చౌటుప్పల్ మండలంలో 66 మిల్లీమీటర్లు, నారాయణపూర్ మండలంలో 33.08 మిల్లీమీటర్ల వర్షం కురువగా జిల్లాలో 1057.4 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళవారం కూడా జిల్లాలో అక్కడక్కడ వర్షపు జల్లులు కురిసాయి. అయితే ఐకేపీ కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కావడంతో కేంద్రాలకు ధాన్యం వస్తుండటం, వరికోతలు సాగుతుండటంతో తుపాను కారణంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే వాతావరణంలో వచ్చిన మార్పులతో పలువురు జలుబు, దగ్గు తదితర జ్వరలక్షణాల బారిన పడుతున్నారు. దీంతో వారందరూ ఆస్పత్రుల బాట పడుతున్నారు. తుపాను ప్రభావం తగ్గేవరకు వృద్ధులు, పిల్లల జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైనంతవరకు రాత్రిపూట త్వరగా ఇంటికి చేరుకోవాలని, తప్పనిసరి అయితేనే ఇంటి నుంచి బయటకురావాలని వైద్యులు సూచిస్తున్నారు. గాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశాలు ఉండటంతో వాటికి దూరంగా ఉండటం మేలని అధికారులు హెచ్చరిస్తున్నారు. తుపాను ముగిసే వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది.

అద్భుత జ్ఞాపకశక్తి.. అరుదైన రికార్డు

● రెండేళ్లకే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వయస్సు రెండేళ్లు కానీ అతని ప్రతిభ అద్భుతం. ఈ ప్రతిభతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. సూర్యాపేట జిల్లా, ఆత్మకూర్(ఎస్) మండలం, నెమ్మికల్ గ్రామానికి చెందిన ఎల్గూరి రాజేష్ లిఖిత దంపతుల కుమారుడు అద్వైత్ (23 నెలలు) అతి చిన్న వయస్సులోనే పెద్దలకు కూడా వంట బట్టని అంశాలను టకీమని చెప్పేస్తున్నాడు. చిన్నప్పటినుంచి చురుకుగా ఉండడం గమనించిన తల్లి లిఖిత పసివాడి నోటి నుంచి బుడిబుడి వాక్కులు విని సంబురపడేవారు. పిల్లాడి ముచ్చటైన పలుకులు చూసి ప్రతీరోజు వివిధ రకాల అంశాలను నేర్పిస్తూ ఉండేవారు. ఈ బాలుడు 26 ఆంగ్ల వర్ణమాల పదాలు, 9 మంచి అలవాట్లు ఉన్న పదాలు, ఐదు రకాల వాహనాలు, 9 మంది స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు, 10 శరీర భాగాలు, 10 రకాల జంతువులు, 12 రకాల ఫలాలు, నాలుగు రకాల రంగులను, అతి చిన్న వయస్సులోనే వివిధ కేటగిరీల్లో 10 అంశాలను గుర్తించాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు పిల్లాడి ప్రతిభను వీడియోలు తీసి ఆగస్టులో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి పంపి దరఖాస్తు చేశారు. అవి చూసి సెప్టెంబరులో అవార్డు నిర్ధారించారు. బాలుడి ప్రతిభను గుర్తించి వారం రోజుల క్రితం ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి ఎంపికైనట్లు ప్రశంసాపత్రం, మెడల్‌ను కొరియర్ ద్వారా అందజేశారు. డిసెంబరులో ప్రత్యక్షంగా ఈ అవార్డు బహూకరించనున్నట్లు బాలుడి తండ్రి రాజేష్ తెలిపాడు. రాజేష్ సూర్యాపేటలో ఓ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లి లిఖిత గృహిణిగా ఉంటుంది. వృత్తిరీత్యా సూర్యాపేటలో ఉంటున్నారు. అతిచిన్న వయస్సులోనే బాలుడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడంపై తల్లిదండ్రులు రాజేష్, లిఖితలు, నెమ్మికల్ గ్రామస్థులు అభినందించారు.

ఇదీ బంగారమేనండోయ్..

● 9కే (క్యారెట్స్) బంగారానికి పెరుగుతున్న డిమాండ్ ● వెండికి బదులు ఇటు వైపు ఆసక్తి ● బీఎస్ఐ హాల్‌మార్క్‌తో విక్రయాలకు సిద్ధం



క్యారెట్ అంటే... బంగారంలో స్వచ్ఛతను కొలిచే ప్రమాణం. 24 క్యారెట్ల బంగారంలో శుద్ధి చేసిన బంగారం 99.9శాతం ఉండగా, 22 క్యారెట్ల ఆభరణాల్లో శుద్ధిచేసిన బంగారం 91.6 శాతం ఉంటుంది. ఇక 18 క్యారెట్లలో 75 శాతం, 14 క్యారెట్లలో 58.3శాతం ఉంటుంది. ప్రస్తుత అవసరాలను బట్టి మార్కెట్లోకి 9 క్యారెట్ల బంగారు ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి. ఇదీ బంగారమేనండోయ్. ఇందులో 37.5 శాతం శుద్ధిచేసిన బంగారం ఉంటుందన్న మాట.

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

పెరుగుతున్న బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ.1.3లక్షలు ఉంది. పరుగులు పెడుతున్న పసిడి కొనేందుకు మధ్య తరగతి వారు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా, ధనవంతులు సైతం సంకోచించే పరిస్థితి ఏర్పడుతోంది. అంత ధర పెట్టి బంగారు నగలు కొనుగోలుచేసి వినియోగించడం ఇబ్బందికరమే. ఈ తరుణంలో 9 క్యారెట్ల బంగారాన్ని అందుబాటులోకి తెస్తున్నారు వ్యాపారులు. ఈ తరహా నగల విక్రయాలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో పాటు బీఎస్ఐ హాల్‌మార్క్‌ను తప్పనిసరి చేసింది.

పెరుగుతున్న డిమాండ్

మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధరలు పెరుగుతుండగా, 9 క్యారెట్ బంగారు నగలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రభుత్వ హామీ, హాల్‌మార్కు ఉండటంతో మార్కెట్‌లో ఎప్పుడైనా ఈ బంగారాన్ని (24క్యారెట్ల బంగారం మాదిరిగినే) విక్రయించుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో తొమ్మిది క్యారెట్ల బంగారానికి క్రమంగా డిమాండ్ పెరుగుతోందంటున్నారు స్థానిక వ్యాపారులు. ఇప్పుడిప్పుడే నగరాల్లో విక్రయాలు జరుగుతున్నాయని, వినియోగదారుల ఆసక్తికి అనుగుణంగా 9కే ఆభరణాలు ఆర్డరిస్తున్నట్లు తెలిపారు.

వెండికి బదులుగా..

బంగారంతో పోలిస్తే వెండి ధరలు ఒకేసారి పడిపోతాయన్న చర్చ మార్కెట్‌లో ఉంది. అంటే బంగారం ధర 20శాతం పడిపోయిన తరుణంలో వెండి ధర 30నుంచి 40 శాతం పడిపోతుందని నిపుణుల విశ్లేషణ. గత ఐదేళ్ల కాలంలో మార్కెట్ హెచ్చుతగ్గులను పరిశీలిస్తే పరిస్థితి అలాగే ఉంది. అయితే నిన్న మొన్నటి వరకూ వెండి కొనుగోలుకు మక్కువ చూపిన మగువలు బీఎస్ఐ హాల్‌మార్క్ ఉండటంతో 9కే బంగారు ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

బంగారమంటే బంగారమే

బంగారానికి ప్రత్యామ్నాయం లేదు. రోల్డ్ గోల్డ్, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు కొంటే అవి పాతబడితే మూలకు వేయాల్సిందే. అందుకే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా 9కే బంగారు ఆభరణాలను మార్కెట్లోకి తెచ్చారు. ఆయా ఆభరాణాలు కొనుగోలు చేస్తే ఎప్పుడైనా క్యాష్ చేసుకోవచ్చు. అంతేగాక ఇంటి పనులు, వంట పనులు చేసుకునే వారికి 9కే ఆభరణాలు బెటర్ ఆప్షన్ అనే చెప్పొచ్చు. ఇటు అందం, అటు హుందాతనం అందించడంతోపాటు రీ వాల్యూ ఉండటంతో 9క్యారెట్ల బంగారు నగలు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. పెట్టుబడి సాధనంగా కాకపోయినా సిసలైన బంగారు పాళ్లతో ఉన్న 9కే బంగారు ఆభరణాలను కొనుగోలు చేయవచ్చంటున్నారు మార్కెట్ రంగ నిపుణులు.

మరికొన్ని రోజుల్లో మార్కెట్లోకి..



ఇప్పుడిప్పుడే 9కే గోల్డ్ ఆభరణాలు మార్కెట్లోకి వస్తున్నాయి. మెట్రోపాలిటన్ సిటీల్లో ఇప్పటికే ఆ తరహా నగల విక్రయాలు జరుగుతున్నాయి. మన దగ్గర 24, 22 క్యారెట్ల బంగారానికే డిమాండ్ ఉంటుంది. అయితే గోల్డ్ రేట్ అమాంతం పెరుగుతుండటంతో వినియోగదారులు ఆలోచిస్తున్నారు. 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారంపై మాత్రమే కస్టమర్లకు అవగాహన ఉంది. 9కే బంగారు ఆభరణాలు మరికొన్ని రోజుల్లోనే పట్టణాల్లోనూ దర్శనమిస్తాయి.

బోనాల శ్రీనివాస్, జ్యువెల్లరీ వ్యాపారి, మిర్యాలగూడ

రోజు వారీ వినియోగానికి బాగుంటున్నాయి



9కే బంగారు నగలు రోజువారీ వినియోగానికి బెటర్‌గా ఉన్నాయి. గతంలో 18కే, 14కే నగలలోనే రకాలుండేవి. ఇప్పుడు అన్ని విభాగాల్లోనూ అనేక రకాల మోడళ్ల నగలు అందుబాటులోకి వస్తున్నాయి. ట్రెండీ, లైట్ వెయిట్‌తో స్టైలిష్ లుక్‌తో ఉన్నాయి కొత్త తరహా అభరణాలు. తొమ్మిది క్యారెట్ల జ్యువెల్లరీలో కంఠాభరణాలతో పోలిస్తే.. చెవికమ్మలు, ఉంగరాలు, బ్రాస్‌లెట్స్ చాలా బాగున్నాయి.

చంద్రకళ, మిర్యాలగూడ.

పత్తి రైతు కంట తేమ

● పత్తి కొనుగోళ్లలో జాప్యం
● నకిరేకల్-అర్వపల్లి జాతీయ రహదారిపై ధర్నా
● రెండు గంటలపాటు భారీగా ట్రాఫిక్ జామ్
● రోడ్డుపై పత్తిని దహనం చేసిన రైతులు
● తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్




నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం పత్తి మిల్ వద్ద నిలిచిన పత్తి ట్రాక్టర్లు, రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

శాలిగౌరారం, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించిన పండించిన పత్తిని వెంటనే కొనుగోలు చేయాలని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాదారం రైతులు డిమాండ్‌చేశారు. నకిరేకల్-అర్వపల్లి జాతీయ రహదారిలో మాదారం వద్ద ధర్నాకు దిగారు. మాదారం సమీపంలోని టీటీఆర్ కాటన్ మిల్లు ప్రారంభమైనా కొనుగోళ్లు చేపట్టక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ రోడ్డెక్కారు. తేమ శాతంతో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని, భారీ వర్షాలతో ఇంకా పత్తి తడిసిపోయి తమకు తీవ్రనష్టం జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా కొంతమంది రైతులు పత్తి బస్తాలను దహనం చేశారు. తేమశాతం ఎక్కువగా ఉందనే నెపంతో అధికారులు కొనుగోలు చేయబోమని చెప్తున్నారని, పత్తి కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు గంటల పాటు ధర్నా చేయడంతో దీంతో ఎటూ మూడు కిలోమీటర్ల మేర వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, శాలిగౌరారం తహసీల్దార్ వరప్రసాద్, శాలిగౌరారం మార్కెట్ కమిటీ కార్యదర్శి చీనా నాయక్‌లు అక్కడి చేరుకొని రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. శాలిగౌరారం మండలం మాదారంలోని టీటీఆర్ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రారంభించారు. వెంటనే 51మంది రైతులు పత్తిని విక్రయించడానికి స్లాట్ బుక్ చేసుకున్నారు. అందులో ఆరుగురు రైతుల పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేశారు. మంగళవారం మిల్ వద్ద రైతుల పత్తి తేమశాతం ఎక్కువగా ఉందని కొనుగోళ్లు నిలిపివేశారు. తుఫాన్ ఉన్నందున ట్రాక్టర్‌లో తెచ్చిన పత్తి కూడా తడిసి తేమశాతం ఎక్కువగా అవుతుందని సీసీఐ అధికారులకు విన్నవించారు. 12శాతం తేమ ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పారు. దీంతో రైతులు మాదారం జాతీయ రహదారిపైకి వచ్చి ధర్నా చేశారు. వర్షాలు పడుతున్నందున తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకుండా వెంటనే పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. మాదారంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో అశోక్‌రెడ్డి మంగళవారం సాయంత్రం నల్లగొండ ఆర్డీవో యానాల అశోక్‌రెడ్డి మాదారంలోని టీటీఆర్ పత్తి మిల్‌ను పరిశీలించారు. సీసీఐ, మార్కెటింగ్ అధికారులు, రైతులతో మాట్లాడారు. సీసీఐ నిబంధనల మేరకు మ్యాచర్ ఉన్న పత్తిని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు కూడా ప్రభుత్వ నిబంధనలను పాటించి అధికారులకు, సిబ్బందికి సహకరించాలని ఆర్డీవో అశోక్ రెడ్డి కోరారు.

రోడ్డుపై బైఠాయించి నిరసన

మోటకొండూరు: పత్తిని కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని ఆరోపిస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు రైతులు ఆందోళనకు దిగారు. మండలకేంద్రంలోని రాయిగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై బైఠాయించి సుమారు గంటపాటు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తేమ, స్లాట్ బుకింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 27న స్లాట్ బుకింగ్ చేసుకున్న 59 మందిలో 28 మంది కేంద్రానికి రాగా, అందులో తొమ్మిది మంది రైతులనుంచి పత్తి కొనుగోలు చేసి మిగతా వారిని నిలిపివేశారన్నారు. పత్తిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని నిర్వాహకులను ప్రశ్నించగా స్థానిక ఎమ్మెల్యే వచ్చి సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దీంతో రైతులు సాయంత్రం వరకు వేచి చూసినా ఫలితం లేకపోడవంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మోత్కూరు మార్కెట్ చైర్మన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కానీ అప్పటికే స్లాట్ బుకింగ్ సమయం ముగియడంతో రైతులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఉదయం పత్తి కొనుగోలు కేంద్రానికి చేరుకోగా నిర్వాహకులు మంగళవారం తెచ్చిన పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామని, ఈ నెల 27న తెచ్చిన పత్తిని కొనుగోలు చేయబోమని చెప్పడంతో ఆగ్రహానికి గురైన రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రమణరెడ్డి, డీఎంవో సబిత, ఏవో రమాదేవి కొనుగోలు కేంద్రానికి వచ్చి రైతులకు నచ్చజెప్పడంతో కొనుగోళ్లు యథావిధిగా ప్రారంభించారు. అంతకు ముందు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ధర్నాను విరమింపజేశారు.

ధాన్యం గ్రేడ్ మార్పిడిపై రైతుల ఆందోళన



నిలిచిపోయిన ధాన్యం తూకం

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఐకేపీ కేంద్రంలో తూకాలు వేసిన 668 బస్తాల ధాన్యాన్ని ఏ-గ్రేడ్ నుంచి బీ-గ్రేడ్‌గా మార్చాలని మిల్లర్ ఒత్తిడి చేయడంపై రైతులు మండిపడుతున్నారు. ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం గ్రేడ్ మార్పిడి సమస్యపై మంగళవారం ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్యకు రైతులు మొర పెట్టుకున్నారు. తూకాలువేసి మిల్లుకు పంపించిన ధాన్యం గ్రేడ్ మార్చితే ముగ్గురు రైతులకు రూ.5345 నష్టం కలగనుంది. అదే కొనసాగితే మరికొంత మంది రైతులకు నష్టం వాటిల్లనుంది. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో సంఘమిత్ర సమాఖ్య నిర్వాహకులు ధాన్యం తూకం వేస్తున్నారు. మండల పరిధిలోని చిన్నకొండూరు గ్రామానికి చెందిన రైతులు అవిశెట్టి వెంకటేశంకు చెందిన 210 బస్తాలు, జినర్సింహకు చెందిన 369 బస్తాలు, బలరామ్‌రెడ్డికి చెందిన 89 బస్తాల ధాన్యాన్ని ఏ-గ్రేడ్ కింద తూకం వేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సరైన తేమ కూడా వచ్చింది. ఈ ధాన్యాన్ని ఏ-గ్రేడ్‌గా ఏఇవో కృష్ణ ధ్రువీకరించారు. ముగ్గురు రైతులకు చెందిన 668 బస్తాల ధాన్యాన్ని మండల పరిధిలోని నేలపట్ల గ్రామంలోని మల్కయ్య రైస్ ఇండస్ట్రీస్‌కు పంపారు. ధాన్యంలో కొర్రీలను చూపించి ఏ-గ్రేడ్‌ను బీ-గ్రేడ్‌గా మార్పిడి చేయాలని ట్రక్ షీట్‌ను మిల్లు యజమాని వాపస్ పంపించారని ఐకేపీ నిర్వాహకులు తెలిపారు. ధాన్యం గ్రేడ్ మార్పిడిని నిరాకరించడంతో మిల్లు వద్ద అన్‌లోడ్‌ను నిలిపివేశారు. ధాన్యం గ్రేడ్ మార్పిడి సమస్యను ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి పబ్బు రాజు గౌడ్‌లు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు నష్టం జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిసింది.

గుట్ట ఇన్‌చార్జి ఈవోగా హరీష్



హరీష్

యాదగిరిగుట్ట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థానానికి ఇన్‌చార్జి ఈవోగా హరీష్‌ను నియమిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ కమిషనర్ పనిచేస్తున్న హరీష్‌ను ఆలయ ఇన్‌చార్జి ఈవోగా నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హరీష్ ఐదు రోజులపాటు ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన రవినాయక్ గడువు నవంబరు ఒకటో తేదీన ముగుస్తుంది.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,48,454 ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో రవినాయక్ తెలిపారు. స్వామి వారిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దర్శించుకున్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణం మంగళవారం కన్నుల పండువగా సాగింది. భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమ, వరద కాల్వలకు

నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ, వరద కాల్వలకు మంగళవారం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ముంథా తుఫాన్ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున కుడి, ఎడమ, వరద కాల్వల ఆయకట్టులో రైతులకు సాగునీటి అవసరం లేనందున్న నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అంతేకాకుండా ఆయకట్టులో కురుస్తున్న వర్షాలతో కాల్వల కట్టలు తెగిపోయే అవకాశం ఉన్నందున కాల్వలకు నీటి విడుదలను నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు. తిరిగి వర్షాలు తగ్గగానే కాల్వలకు నీటి విడుదలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

తగ్గిన అనుమతులు

నిలిచిన ఇసుక దందా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలో రెండు రోజులుగా ఇసుక అక్రమ రవాణా తగ్గింది. ఇసుక అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి'లో 'ఒక్క దానికి అనుమతి.. 3 ట్రాక్టర్లలో తరలింపు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంతో ఇసుక ట్రాక్టర్లు ఒక్కసారిగా నిలిచిపోయాయి. మైనింగ్, రెవెన్యూ అధికారులు ఇసుక, మట్టి తరలించిన ప్రాంతాలను పరిశీలించారు. ఇసుక అనుమతులను పూర్తిగా తగ్గించారు. ఇందిరమ్మ ఇళ్లకు జీపీవోల ద్వారా విచారణ చేసి అర్హులైన వారికే అనుమతులు ఇస్తున్నామని, వారంలో ఒక్కరోజు మాత్రమే అనుమతులిస్తామని తహసీల్దార్ అనిత తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

శాంతి కోసమే సంకల్ప పాదయాత్ర

● కోదాడ నుంచి మట్టపల్లి వరకు తమిళనాడు భక్తుల పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మఠంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి కోసమే సంకల్ప పాదయాత్ర కొనసాగుతుందని మట్టపల్లి దేవస్థాన ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ అన్నారు. ముక్కూరు పీఠం వ్యవస్థాపకుడు ఎంఎన్ శ్రీనివాసన్ సమక్షంలో నిర్వహించిన 26వ సంకల్పిత పాదయాత్ర మంగళవారం తెల్లవారుజామున కోదాడ పట్టణంలో ప్రారంభమై సాయంత్రం మట్టపల్లి క్షేత్రానికి చేరింది. తమిళనాడు నుంచి ప్రారంభమైన యాత్ర మట్టపల్లికి చేరుకుంది. నృసింహుడి దీక్షదారులతోపాటు 200 మందికిపైగా కాలినడకన రాత్రి 7గంటలకు మట్టపల్లి క్షేత్రానికి చేరుకున్నారు. కోదాడ, చిలుకూరు, హుజూర్‌నగర్, ఎర్రగట్టు, బక్కమంతులగూడెం, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు, ఎన్‌సీఎల్ మీదుగా పాదయాత్ర సాగింది. మండల కేంద్రంలోని కనుకదుర్గ దేవాలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలు, ఆయు ఆరోగ్యాలతో ఉండాలని పాదయాత్ర చేపట్టినట్లు ముక్కూరు పీఠం వ్యవస్థాపకుడు శ్రీనివాసన్ తెలిపారు.

పోచంపల్లి ఇక్కత్ తయారీ అద్భుతం

పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం ప్రశంస



వస్త్ర తయారీని పరిశీలిస్తున్న చింతకింది మల్లేశం

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియ అద్భుతం అని పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం అన్నారు. యునైటెడ్ వే హైదరాబాద్, ఫెర్నోడ్ రికార్డ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాలకు చెందిన ప్రీలూమ్, లూమ్ శిక్షణార్థుల క్షేత్రపర్యటనలో భాగంగా మంగళవారం భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. లూమ్‌లపై అవగాహన పెంచుకునేందుకు ఇక్కడికి వచ్చారు. 50 మంది శిక్షణ పొందుతున్న కళాకారులు పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం పర్యవేక్షణలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆవిష్కరణల ప్రయాణం, సృజనాత్మక భావన, మహిళల జీవితాల్లో తాను తెచ్చిన మార్పుల గురించి శిక్షణార్థులకు వివరించారు. కార్యక్రమంలో యునైటెడ్ వే హైదరాబాద్ ప్రతినిధులు దిలీప్‌కుమార్, కోమల్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల తయారీని పరిశీలించిన విద్యార్థులు

పోచంపల్లి చేనేత ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలను తెలుసుకునేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని శివశివాణి డిగ్రీకాలేజీ విద్యార్థులు క్షేత్రపర్యటనలో భాగంగా భూదాన్‌పోచంపల్లిలో మంగళవారం పర్యటించారు. పట్టణంలోని కళాపునర్వి యూనిట్ సందర్శించి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ ప్రక్రియలను తెలుసుకున్నారు. కళాపునర్వి వ్యవస్థాపకులు సాయిని భాస్కర్, భరత్‌లు పోచంపల్లి ఇక్కత్ ప్రాముఖ్యతను వివరించారు.


నిర్లక్ష్యం వేళ్లూనుకుంటోంది

ప్రమాదం అంచున మూసీ వంతెన ● వంతెన పక్కనుంచి పెరిగిన మొక్కలు

వేములపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగుపై ఏర్పాటు చేసిన వంతెనకు మొక్కల ముంపు పొంచి ఉంది. ఈ వంతెనకు అటువైపు, ఇటువైపు గల గోడలపై రావి చెట్లు మొలిచి పెద్ద వృక్షాలుగా మారాయి. వీటి వేర్లు బాగా రాతి గోడల్లోకి చొచ్చుకొని పోయాయి. దీంతో వంతెన గోడలు పలుచోట్ల బీటలువారి దెబ్బతినే స్థితిలో ఉన్నాయి. ఫలితంగా వంతెన బలహీనపడి నీటి చెమ్మలు సన్నటి దారలా బ్రిడ్జి వెంట పారుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అద్భుత కట్టడం.. ఈ వంతెన నిర్మాణం

సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు సాగు నీరు అందించేందుకు లాల్ బహదూర్ శాస్త్రి కెనాల్(ఎడమకాల్వ) నిర్మాణాన్ని నాటి ఇంజనీర్లు 1955-60 మధ్య కాలంలో చేపట్టారు. సుమారు 74.09 కిలోమీటర్ల దూరంలో రావులపెంట గ్రామ శివారులో మూసీ వాగు ఉండగా దాని మీదుగా నీటిని తరలించేందుకు వంతెన(అక్విడక్ట్) నిర్మాణాన్ని అద్భుతంగా చేపట్టారు. అక్విడక్ట్ అనేది కాల్వ నీటిని సహజ వాగులు, నదులు, లోయల మీదుగా తీసుకెళ్లడానికి చేపట్టిన నిర్మాణం. రావులపెంట శివారులోని మూసీవాగుపై సుమారు 356 మీటర్ల పొడవున 32రాతి ఖానాలతో యు ఆకారంలో 23 మీటర్ల వెడల్పుతో పెద్ద బ్రిడ్జిని ఏర్పాటు చేయడం నాటి ఇంజనీర్ల ప్రతిభకు నిదర్శనంగా నేటికీ దర్శనమిస్తుంది. ఈ బ్రిడ్జి పైభాగం నుంచి సాగర్ ఎడమకాల్వ నీరు వేగంగా ప్రవహించేలా, సమీప గ్రామాల రైతులు, గ్రామస్థులు రాకపోకలు సాగించేలా వంతెన కింది నుంచి మూసీవాగు ప్రవహించేలా ఈ వంతెనను నిర్మించారు. సాగర్ నుంచి వచ్చే నీరు మూసీ నదిపై ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చేపట్టిన నిర్మాణమే ఈ అక్విడక్ట్. మూసీ నదికి భారీగా నీరు వచ్చే సమయంలో కింద మూసీ నది ప్రవాహం, పైన కృష్ణమ్మ పరవళ్లతో చూపరులను ఆకట్టుకుంటున్న అద్భుత నిర్మాణం పొడవునా నేడు మొక్కలు భారీగా పెరుగుతుండడంతో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఏళ్ల నాటి నుంచి రైతులకు అండగా ఉంటున్న ఈ వంతెన మరమ్మతులకు నోచకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు వంతెనకు ఇరువైపులా మొక్కలను తొలగించి వంతెనకు ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుకుంటున్నారు.



మూసీ వాగుపై నిర్మించిన రాతి వంతెన

వంతెన పొడవునా పెరుగుతున్న రావి, మర్రి మొక్కలు

వంతెన పక్క నుంచి పెరిగిన చెట్టు

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

మర్రిగూడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శివన్నగూడ రైతు సేవా సహకార సంఘంలో ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు సంఘం చైర్మన్ బాలం నరసింహ తెలిపారు. కుదాబక్షపల్లి, శివన్నగూడ గ్రామాల్లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెరువు అలుగుకు మరమ్మతులు చేపట్టాలి

శాలిగౌరారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు మాదారం గ్రామ శివారులోని రామ సముద్రం చెరువు అలుగు మొత్తం కూలిపోయే దశలో ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ మండల కార్మిక విభాగం అధ్యక్షుడు మామిడి రమేష్ కోరారు. తహసీల్దార్ బిట్ల వరప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలుగును పరిశీలించి నూతన అలుగు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోడదాటి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి రమేష్

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్ విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత స్థానాలకు ఎదగాలని పశుసంవర్ధకశాఖ జేడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏబీసీడీ బాలికల క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన భోజనంతో పాటు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోఎస్ విజయలక్ష్మి, స్వప్న, సత్యావతి, దూసరి భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మారకోత్సవాలు నిర్వహించాలి

నకిరేకల్, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): నవంబరు 1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల స్మారకోత్సవాలు నిర్వహించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సాగర్ పిలుపునిచ్చారు. పట్టణంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. విప్లవోద్యమంలో అనేక మంది కార్యకర్తలు నవంబరు నెలలోనే అమరులయ్యారని తెలిపారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం వెలుగులోకి పీడిత ప్రజల విముక్తి కోసం భారత విప్లవోద్యనిర్మాణ క్రమంలో చంద్ర పుల్లారెడ్డి, మంజుధర్, సత్యనారాయణ సింగ్, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు ఉద్యమాలను కొనసాగించారని తెలిపారు.

నవంబరు 1న దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఇప్పటి వరకు కేసు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబరు 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ తెలిపారు. జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో లమాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే సామాన్య దళితుడికి రక్షణ ఎలా ఉంటుందన్నారు. దాడి జరిగి 20రోజులు గడుస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు మలపాక వెంకన్న, నర్సింహ, సాయికిరణ్, గోపీచంద్, నరేష్, మురళీ, స్వామి, అన్నపూర్ణ, శైలజ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు



మర్రిగూడలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఉద్యోగులు

మర్రిగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధ చూపాలని వైద్య ఆరోగ్య వైద్యాధికారి శాలిని అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సిబ్బందిని వైద్యులు పరీక్షించి రక్తనమునాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ నిర్మలదేవి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, ఆర్ఐ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు: మునుగోడు పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని డీపీవో, మండల ప్రత్యేకాధికారి వెంకయ్య ప్రారంభించారు. మండల పరిషత్ అనుబంధ శాఖలు, రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఇరుకు రోడ్డు.. ప్రమాదాలకు నెలవు

● తరుచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు ● వెడల్పునకు నోచని మర్రిగూడ- నాంపల్లికి వెళ్లే రోడ్డు



మర్రిగూడలో ఇరుకుగా ఉన్న రోడ్డు

మర్రిగూడ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇరుకు రోడ్లతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మర్రిగూడ మండలకేంద్రం బస్టాండ్ ఉంచి హాస్టల్ సమీపం నుంచి నాంపల్లికి వెళ్లే సుమారు అర కిలోమీటర్ వరకు రోడ్డు ఇరుకుగా ఉంది. గృహాలు, దుకాణాలు రోడ్డుకు దగ్గరగా ఉన్నాయి. దీనికి తోడు ఓపెన్ డ్రైనేజీ ఉండడంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఎటువైపు వెళ్లాలో తెలియక పక్కన ఉన్న డ్రైనేజీలో పడిన సంఘటనలు ఉన్నాయి. రోడ్డు వెడల్పు చేయడానికి 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, గృహాలను తొలగించేందుకు నెంబర్లు వేశారు. ఇళ్లు పూర్తిగా తొలగిస్తే పరిహారం అందిస్తామని అప్పటి ఎమ్మెల్యే కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి చర్చలు జరిపారు. తర్వాత రోడ్డు వెడల్పు కార్యక్రమం అర్థాంతరంగా నిలిచింది. నియోజకవర్గంలోని మునుగోడు, చండూరు నాంపల్లి మండలాల్లో మండలకేంద్రాల్లో రోడ్డు వెడల్పు చేసే కార్యక్రమంలో చురుకుగా సాగుతున్నాయి. మర్రిగూడ మండలకేంద్రంలో ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేయడంలేదు. గుర్రంపోడు, నాంపల్లి మండలాల నుంచి వందలాది వాహనాలు ప్రయాణికులు మర్రిగూడ మండలకేంద్రం నుంచే వ్యాపారాల ఇతర పనుల కోసం నిత్యం మాల్ హైదరాబాద్ పట్టణాలకు వెళ్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మునుగోడు, చండూరు, నాంపల్లి మండలకేంద్రాల్లో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేపడుతున్నా మర్రిగూడెం మండలకేంద్రంలో ఎందుకు రోడ్డు వెడల్పు చేపట్టడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. బస్టాండ్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో మండలకేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే మర్రిగూడ చౌరస్తా నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు (నాంపల్లికి వెళ్లే రోడ్డు) డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని, అది అమలు కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డు ఇరుకుతో డ్రైనేజీలో పడిన కారు తీస్తున్న ప్రయాణికులు(ఫైల్)

ఇరుకు రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయి



గ్రామీణ వికాస్ బ్యాంకు నుంచి ప్రధాన రోడ్డు ఇరుకుగా ఉంది. దీనికి తోడు రోడ్డు పక్కనే ఓపెన్ డ్రైనేజీ ఉన్నందున వాహనదారులు డ్రైనేజీలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేసి ప్రమాదాల నుంచి తప్పించాలి. ఈ రోడ్డు వెంట నిత్యం వందలాది వాహనాలు, బాటసారులు, ప్రయాణికులు వెళ్తుంటారు.

● కొలుకులపల్లి యాదయ్య, మర్రిగూడెం.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



చిట్యాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మునిసిపాలిటీ పరిధిలోని వెంకటాపురం గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటను మంగళవారం పరిశీలించారు. అధిక వర్షాలతో పత్తి చేలతో పాటు వరిచేలు కూడా దెబ్బతిన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం కూడా తడిసిందని, కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఐతరాజు నర్సింహ, అరూరి శ్రీను, మల్లం మహేష్, బొబ్బల సుధాకర్‌రెడ్డి, లడే రాములు, యాదయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి: వర్షాలతో అధైర్యపడొద్దని నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజుల సూచించారు. మండలంలోని కొప్పోలు, చీకటిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో రైతుల ధాన్యం రాశులను చూసి రెండు రోజుల పాటు వర్షాలు ఉన్నాందున ధాన్యం తడవకుండా జగ్రత్త పడాలన్నారు. వర్షాలు తగ్గగానే ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నిర్ణీత తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వహకులకు సూచించారు. ఆమె వెంట డైరెక్టర్లు బయ్య ముత్తయ్య, పర్వయ్య, కాంగ్రెస్ నాయకులు జి.మాధవరెడ్డి, కోట పూర్ణచందర్ రావు, సైదిరెడ్డి, అశోక్ తదితరులు ఉన్నారు.

మరమ్మతుల కోసం రోడ్డు పరిశీలన

శాలిగౌరారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం, మండల పరిధిలోని భైరవునిబండ నుంచి నార్కట్‌పల్లి మండలం అద్దెలోనిబాయి- నక్కలపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ కొండయ్య, ఏఈ భరత్‌చంద్ర గురువారం పరిశీలించారు. రోడ్డు మరమ్మతుల కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భైరవు నిబండ మాజీ సర్పంచ్ దండ రేణుక అశోక్‌రెడ్డి, నరిగె శంబయ్య, శంకర్, జి. వెంకటరెడ్డి, బిక్షం, వి. రాజు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



రైతు నేస్తం.. అధికారులే సమస్తం

పత్తి పంట విక్రయం కోసం రూపొందించిన కపాస్ యాప్ వాడకంతో పాటు సమస్యలు తెలుసుకుని సలహాలు ఇచ్చేందుకు రైతుల కోసమే మంగళవారం నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు నార్కట్‌పల్లి రైతు వేదిక వద్ద కేవలం వ్యవసాయ శాఖ అధికారులే హాజరయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొనే రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌పై ఒకరోజు ముందుగానే వ్యవసాయ, విస్తరణ అధికారులు ప్రచారం చేసినా రైతులెవరూ హాజరు కాలేదు. రైతువేదికలో వేసిన కుర్చీలన్నీ ఖాళీగా కన్పించాయి.

● నార్కట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

రైతుల్లో మొంథా గుబులు

(5వ పేజీ తరువాయి)

కోరుతున్నారు. ఈ మండలంలో 20 నుంచి 30 ఎకరాల్లో పత్తి నీట మునిగింది. నిడమనూరు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తోడు మొంథా తుపాన్ తోడైంది. దీంతో పలు గ్రామాల్లో పొలాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాడ్గులపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తుండగా, కొనుగోళ్లు సకాలంలో జరగడం లేదు. మునుగోడు మండల పరిధిలోని వర్షానికి వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల పత్తి పంటతో పాటు ధాన్యం రంగు మారింది. తిరుమలగిరి సాగర్ మండలంలో నాట్లు ఆలస్యంగా జరగడంతో ప్రస్తుతం పంట గింజ తయారై దశలో ఉండగా వర్షాలతో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 500 ఎకరాల్లో వరి నేలవాలింది.

నేలవాలిన వరిచేలు

(ఆంధ్రజ్యోతి, నాంపల్లి): నాంపల్లి మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన వరిచేలు నేలవాలుతున్నాయి. దీంతో పంట కింది భాగం మొలక, తాలు, రంగుమారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగుకాగా, అందులో 2,300 ఎకరాల్లో సన్నరకం ఉంది. వర్షాలకు మండలంలో 800 ఎకరాల్లో వరి దెబ్బతింది.

నాలుగెకరాలు నేలవాలింది



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశా. గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిచేలను నేలవాలింది. దీంతో పూర్తిగా నష్టపోయా. వరికి ఇప్పటి వరకు రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట నష్టపోయి అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

● రెవల్లి బాలయ్య, రైతు తుమ్మలపల్లి

శిశు విక్రయాలు చట్ట విరుద్ధం



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

కట్టంగూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): శిశు విక్రయాలు చట్ట విరుద్ధమని ఐసీడీఎస్ సీడీపీవో అస్రా అంజుమ్ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. బాలింతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శిశువులను విక్రయించేందుకు ప్రయత్నించినా, విక్రయించినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బాలింతలు ఉన్న గృహాలకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారాదారాణి, అంగన్‌వాడీ టీచర్ తొట్ల మంగమ్మ ఉన్నారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

శాలిగౌరారం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్‌తో వాతావరణం అనుకూలంగా లేనందున శాలిగౌరారం మండలం మాదారంలోని టీఆర్ఆర్ కాటన్ మిల్‌లోని సీసీఐ కేంద్రంలో ఈ నెల 29 నుంచి నవంబరు 4వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ తెలిపారు. 5వ తేదీన తిరిగి కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు 12 తేమ శాతం పత్తిని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఆయన సూచించారు.

దర్వేశిపురం ఆలయంలో పూజలు

కనగల్, అక్టోబరు 28: (ఆంధ్రజ్యోతి): కనగల్ ఎంపీడీవోగా బాధ్యతలను చేపట్టిన ఆవ వేదరక్షిత మంగళవారం మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఎంపీడీవోకు అర్చకులు వేద ఆశీర్వచనాలు, అమ్మవారి వస్త్రాలను, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, కార్యదర్శి దేవిరెడ్డి పద్మ తదితరులున్నారు. రెడ్డి జాగృతి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మందడి సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీరసారె అందజేసి మొక్కు చెల్లించుకున్నారు. ఇటీవల నల్లగొండ ఎన్జీ కళాశాలలో సంఘం తరుపున ఐదు వేల మంది మహిళలతో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు విజయవంతమైన నేపథ్యంలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగమణిరెడ్డి, సరళ, జ్యోతి, సరస్వతి, అరుణ తదితరులున్నారు.

తుమ్మలపల్లిలో నేడు మెగా హెల్త్ క్యాంపు

నాంపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపల్లి గ్రామంలో బుధవారం హైదరాబాద్ మలకపేట యశోద ఆసుపత్రి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మాల్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కందికట్ల సరస్వతివెంకటేష్ మంగళవారం తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ వీరమనేని చేతన్‌రావు స్వగ్రామం కావడంతో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనరల్ ఫిజిషియన్, స్త్రీల వ్యాధి నిపుణులు, ఆర్థోపెటిక్, యూరాలజీ, వైద్య నిపుణులు, కిడ్నీ, ఊపిరితిత్తులు, గుండె వ్యాధి నిపుణులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

హాస్టళ్లలో మెనూ పాటించాలి : డీపీవో

మునుగోడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ప్రకారం గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు అన్ని పాఠశాలల్లో విధిగా మెనూను పాటించాలని డీపీవో, మండల ప్రత్యేకాధికారి వెంకయ్య అన్నారు. మునుగోడులోని మహాత్మా జ్యోతిబా పులే బాలికల గురుకుల పాఠశాలను స్థానిక ఎంఈవో టీ. మల్లేశంతో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, పాఠశాల తరగతి గదులు పరిశీలించారు. బోధనతో పాటు విద్యార్థుల విద్య స్థాయి వంటి వివిధ అంశాలపై ఆరా తీశారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఉన్నారు.

కిష్టాపురం చెక్‌డ్యాం సమస్యలు పరిష్కరించాలి

మునుగోడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మించే చెక్‌డ్యాంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. రైతులతో కలిసి ఇరిగేషన్ శాఖ డీఈ ప్రేమ్‌కుమార్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. చెక్‌డ్యాంను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారం చూపుతానని డీఈ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత వేదాంతం గోపీనాథ్, ఇప్పర్తి మాజీ ఉపసర్పంచి పులకరం సైదులు తదితరులు పాల్గొన్నారు.

టీజీ లింగంగౌడ్‌కు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న లింగంగౌడ్

నార్కట్‌పల్లి, అక్టోబరు 28,(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లికి చెందిన నేస్తం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీజీ లింగంగౌడ్ సేవారత్న అవార్డు అందుకున్నారు. సాహితీరత్న చిక్కారామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. సేవా కార్యక్రమాలను గుర్తించి సేవారత్న అవార్డుకు ఎంపిక చేశారని లింగంగౌడ్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

మర్రిగూడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఈద అంజయ్య పది రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అంజయ్యతో పాటు పదో తరగతి చదువుకున్న 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50వేల సాయాన్ని అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గునుగంటి యాదయ్య గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, ఈద కృష్ణ, కొడిచెర్ల రవి, పిట్టల ప్రభాకర్, సాయి కుమార్, ఇస్మాయినాయక్, నీల మహేష్, వెంకటయ్య, జగన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మంగళవారం పురస్కరించుకుని స్థానిక రేణుకా(కాళికా మాత)ఎల్లమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉత్తరాపల్లి నర్సింహాచార్యులచే పూజాధికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూర్తిని అర్చకులు ముగ్ధమనోహరంగా అలంకరించారు.


సీపీఎం సీనియర్ నాయకుడు శ్రీరాములు మృతి

కేతేపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నాగెల్లి శ్రీరాములు(92) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్. లూర్దుమారయ్య, నాయకులు ఎల్. రాజు, బోళ్ళ జానకమ్మ, కె. బాలయ్య, గాదె సత్తిరెడ్డి, సీహెచ్. నాగయ్య, వి. వెంకన్న, పి. మల్లయ్య తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిష్ఠం 29.5
కనిష్ఠం 22.0



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588 (306.1010)	34,663	33,283
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.50 (4.33)	2,964.38	2,964.38
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.192 (40.0706)	42,330	57,477

చికెన్ ధరలు | లైవ్ : రూ.149 | డ్రెస్ : రూ.230 | స్కిన్‌లెస్ : రూ.260

మాడ్గులపల్లి మండలంలో నేలకొరిగిన వరి



రైతుల్లో మొంథా గుబులు

జిల్లాలో ఇప్పటికే అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు నష్టపోతున్న సమయంలో మొంథా తుపాన్ తోడైంది. తుపాన్ ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచే జిల్లాలో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటి వరకు మోస్తరుగా వర్షాలు కురుస్తు న్నా, రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయ ని వాతావరణశాఖ ప్రకటించింది. దీం తో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

- (ఆంధ్రజ్యోతి, నల్లగొండ, మిర్యాలగూడ)

» నేలవాలిన వరి చేలు
» తడిసి ముద్దవుతున్న పత్తి
» ధాన్యం, పత్తి కొనుగోళ్లకు ఆటంకాలు
» ఆందోళనకు గురవుతున్న రైతులు

రాష్ట్రానికి సరిహద్దులోని ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తుపాన్ ప్రభావంతో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతానికి జిల్లాలో భారీ వర్షాలు లేకున్నా, బలంగా వీస్తున్న ఈదురు గాలులకు వరిచేలు నేలకు ఒరుగుతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు 41వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేశాయి. సీసీఐ ఇప్పటి వరకు 1,000క్వింటాళ్లకు మించి పత్తి కొనుగోలు చేయలేదు. ఐకేపీ కేంద్రాలను అనువుగా లేని చోట ఏర్పాటుచేయడంతో వర్షాలు కురిసినప్పుడు ధాన్యం వరదకు కొట్టుకుపోతోంది. దీంతో కొనుగోళ్లకు ఆటంకం కలుగుతోంది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో వరి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాలతో తేమ సమస్య కూడా అధికమైంది. వరితో పాటు పత్తిలో తేమశాతం పెరిగి కొనుగోళ్లకు నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నష్టపోతున్న రైతులు

తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి మిర్యాలగూడ డివిజన్‌లో 15 వేల ఎకరాలకు పైగా వరి నేలకు ఒరిగింది. ఇప్పటికే గత నెల నుంచి కురుస్తున్న అడపాదడపా వర్షాలకు ఎత్తుగా పెరిగిన వరిచేలు గాలివానకు నేలవాలి పోతున్నాయి. మరో 10 నుంచి 15 రోజుల్లో కోతకు రావాల్సిన వరిచేలు ఒరిగిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట నోటికాడికి వచ్చే ముందు నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్రిపురారం మండలంలో తుపాన్ ధాటికి వరిచేలు ఒరిగాయి. మర్రిగూడ మండలం తానేదార్‌పల్లి గ్రామంలో వరి నేలవాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. అనుముల మండలం సాగర్ ఎడమ కాల్వ కింద వరిపొలాలు ఏపుగా పెరగడంతో గాలికి, వానకు నేలకొరుగుతున్నాయి. చింతపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి పత్తి చేలల్లో వర్షపు నీరు నిలిచింది. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని రైతులు ...

- మిగతా 8వ పేజీలో...

ఇష్టపడి చదివితే సులభంగా ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి భీమ్‌సింగ్



సాగర్ సైలాన్ కాలనీలో విద్యార్థి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్

హాలియా, నాగార్జునసాగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇష్టపడి చదివితే సులభంగా ఉత్తీర్ణత సాధించవచ్చని ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి భీమ్‌సింగ్ అన్నారు. మంగళవారం హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాగర్ హిల్‌కాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫేస్ రికగ్నేజేషన్ యాప్‌లో ప్రతీ విద్యార్థి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలతో కూడిన హామీపత్రాన్ని తీసుకోవాలని సూచించారు. నవంబరు నుంచి ప్రతీ కళాశాలకు డిజిటల్ బోర్డులు అందజేస్తామని, వాటి ద్వారా ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులు ప్రసారం అవుతాయన్నారు. సాగర్‌లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాళ్లు జాకిర్ హుస్సేన్, రాజశేఖర్, అధ్యాపకులు ఆదిరెడ్డి, బాలరాజు, వెంకట్‌నాయక్, హరికృష్ణ, సంజీవరెడ్డి, లింగమూర్తి, సతీష్ చంద్ర, వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, ఉపేంద్రాచారి, గోపాలకృష్ణ, మాధురి, సైదమ్మ, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

(ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి): కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. మంగళవారం నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల, అధ్యాపకుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఫేస్ రికగ్నైజేషన్ అమలు తీరును తనిఖీ చేశారు. ఉన్నత ప్రమాణాలు, నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆదేశించారు. కళాశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలించారు. మౌలిక వసతులపై విద్యార్థులను అడిగారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

పత్తి రైతు కంట తేమ

● పత్తి కొనుగోళ్లలో జాప్యం ● రాయిగిరి-మోత్కూరు రహదారిపై ధర్నా
● గంటలపాటు రైతుల ఆందోళన

7



నకిరేకల్-అర్వపల్లి జాతీయ రహదారిపై పత్తిని దహనం చేసి ధర్నా చేస్తున్న రైతులు

మత్తే ముంచుతోంది



హైవేల వెంట బెల్ట్ దుకాణాలు
ప్రమాదాలకు కారణమవుతున్న మద్యం మత్తు
పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు

రోడ్డు ప్రమాదాలకు మద్యం మత్తు ప్రధాన కారణంగా ఉంటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జాతీయ రహదారుల వెంట సమయపాలన లేకుండా నిరంతరం మద్యం లభిస్తోంది. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ రహదారిపై సూర్యాపేట, చిట్యాల, మునగాల ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలు మూసిన అనంతరం రాత్రి 10 గంటల తర్వాత బెల్ట్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. అధిక ధరలు తీసుకుంటున్నా మద్యం ప్రియులు కొనుగోలు చేసి సేవిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ప్రాణాలు కోల్పోతూనే, ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ తరహా ఘటనల్లో మృతుల్లో ఎక్కువగా యువకులే ఉంటున్నారు. మరికొందరు దివ్యాంగులుగా మారిపోతున్నారు. బెల్ట్ దుకాణాలను నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీస్‌శాఖల పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

6

అవినీతికి పాల్పడితే సమాచారం ఇవ్వాలి

ఏఎస్పీ బి.ప్రతాప్‌కుమార్



అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వశాఖల్లో అవినీతి, అక్రమాలు జరిగినా, నిధులు దుర్వినియోగానికి పాల్పడినా టోల్‌ఫ్రీ నెంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాంతీయ నిఘా అమలు అధికారి, ఏఎస్పీ బి.ప్రతాప్‌కుమార్ సూచించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజిలెన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, విజిలెన్స్ అధికారులు కె.ఇందిరా, ఎస్‌కే.గౌస్, సింగం నాగరాజుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి

టాప్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

నల్లగొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని యూటీఎఫ్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సంఘం నల్లగొండ డివిజన్ మహాసభల్లో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్స్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టాప్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ లింగా అరుణ మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్లను, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎస్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్, కుకుడాల గోవర్ధన్, కోశాధికారి ఎండీ.అబ్దుల్‌ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాఫెల్, వై.సత్తయ్య, రాధారపు భిక్షపతి, పాల్గొన్నారు.

● నల్లగొండ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిట్టిపోలు భిక్షమయ్య, అధ్యక్షుడిగా గుండాల భిక్షమయ్య, ప్రధాన కార్యదర్శిగా చేపూరి పరశురాములు, ఉపాధ్యక్షులుగా కొమ్మారెడ్డి రాయపురెడ్డి, ఏశాల జయలక్ష్మి, సామఅంజిరెడ్డి, కోశాధికారిగా రాపోలు వెంకటేశం, కార్యదర్శులుగా సావిత్రి పటాలే, పెండెం విజయకుమారి, మౌలానా అస్కర్, రచ్చ సూర్యనారాయణ, ఆడిట్ కన్వీనర్‌గా వనమా నరసింహ ఎన్నికయ్యారు.

ఇదీ బంగారమేనండోయ్..

● 9క్యారెట్ల బంగారానికి పెరుగుతున్న డిమాండ్
● వెండికి బదులు ఆసక్తి చూపుతున్న వినియోగదారులు

7

విడతల వారీగా ధాన్యం తెచ్చేలా అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులు విడతలవారీగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్లకు వర్షాలు సవాల్‌గా మారాయని, ఒకేసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. రైతులు విడతల వారీగా ధాన్యాన్ని తీసుకువస్తే కొనుగోలు కేంద్రాలతో పాటు, మిల్లుల్లో ఇబ్బంది ఉండదనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. వరి కోతల ఆధారంగా వ్యవసాయశాఖ షెడ్యూల్‌ను రూపొందించాలని ఆదేశించారు. ఒకేసారి వరి కోతలు జరగకుండా డివిజన్ల వారీగా హార్వెస్టర్ల యజమానులతో సమావేశాలు నిర్వహించామన్నారు. మిర్యాలగూడ ప్రాంతంలో సన్నధాన్యం ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున మిల్లుల వద్ద ట్రాక్టర్లు నిలిచిపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు.



నకిరేకల్‌లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

వీటిని దృష్టిలో ఉంచుకొని మిల్లర్లు ఎలాంటి సమస్యలు సృష్టించవద్దని కోరారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో రైతులకు, జిల్లా యంత్రాంగానికి, మిల్లర్లకు ఇబ్బందులు కలగకుండా పోలీస్‌శాఖ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. ఒకేసారి ధాన్యం రాకుండా అవసరమైతే టోకెన్లు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, రాజశేఖర్‌శర్మ, డీసీవో పత్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశం, డీఎం గోపికృష్ణ, జేడీఏ శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, కట్టంగూరు, నకిరేకల్): తుపాన్‌తో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం కట్టంగూరు మండలంలోని అయిటిపాముల, కట్టంగూరు, నకిరేకల్‌లోని చీమలగడ్డ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, ఆర్డీవో అశోక్‌రెడ్డితో కలిసి తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. రైతులు వ్యవసాయ బావుల వద్దే ధాన్యాన్ని ఆరబెట్టి తేమ 17శాతం లోపు వచ్చాక కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మొంథా తుపాన్ తగ్గే వరకు రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావద్దన్నారు. లారీల కొరత, మిల్లర్ల సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఆమె వెంట కట్టంగూరు, నకిరేకల్ తహసీల్దార్లు పుష్పలత, యాదగిరి, ఉన్నారు.

ఎల్ఐసీ సొమ్ము అదానీకి ధారాదత్తం

సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో ఉన్న రూ.33వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును సంక్షోభంలో ఉన్న ఆదానీ కంపెనీకి కేంద్ర ప్రభుత్వం కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూల వ్యవహరిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం వేదికగా డిసెంబరు 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందన్నారు. ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని తరలిరావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం, పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడానికి రైతులకు సరైన వసతులు కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరాస్వామి, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వేళ్లూనుకుంటోంది

ప్రమాదం అంచున మూసీ వంతెన ● వంతెన పక్కనుంచి పెరిగిన మొక్కలు

7

కాంగ్రెస్ ఎన్నికల అబ్జర్వర్‌గా ఎంఏ సలీమ్



మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మైనార్టీ సెల్ డిస్ట్రిక్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎంఏ. సలీమ్‌ను జూబీహిల్స్ ఉప ఎన్నికల అబ్జర్వర్‌గా నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ సెల్ తెలంగాణ ఇన్‌చార్జి హెచ్‌ఎం షకీల్ నవాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సలీ విలేకరులతో మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలను సమన్వయపరిచి, పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు.

రైతులను ఆదుకోవాలి

చింతపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి, ధాన్యం పంటలు చేతికి వచ్చే సమయానికి జలమయవని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో సీసీఐ కొనుగోలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

రైతులకు తీరని శోకం

● *మొంథా తుఫాను ప్రభావంతో నేల కొరిగిన వరి చేలు* ● *ఆందోళనలో అన్నదాతలు*



వేములపల్లి : తిమ్మారెడ్డి గూడెంలో నీటి పాలైన వరిని పరిశీలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి ఈదురుగాలులతో దంచి కొట్టిన వాన రైతులకు తీరని శోకం మిగిల్చింది. వర్షం ధాటికి పంటచేలు నేలకొరిగాయి. మరో పదిరోజుల్లో పంట చేతికి వస్తుందనగా భారీగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో సుమారు 10 వేల ఎకరాల్లో పంట చేలు పడుగు పేకల్లా మారాయి. రెక్కల కష్టం పోయినా కనీసం పెట్టుబడి వ్యయమైనా చేతికి అందుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో ప్రతి ఏటా పంట చేతికి అందుతుందో లేదోనని ఎదురుచూడడంతో వ్యవసాయం జూదంలా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్‌లో భారీగా వర్షం

తుఫాన్‌ప్రభావంతో మిర్యాలగూడ డివిజన్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అత్యధికంగా మిర్యాలగూడ మండలంలో 20.2 మి.మీ వర్షపాతం నమోదైంది. తిరుమలగిరి సాగర్ 19.8, అడవిదేవులపల్లి 16.2, దామరచర్ల 13.8, హాలియాలో 10.4, త్రిపురారం 11.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో ఆయకట్టు ప్రాంతంలో అనేక చోట్ల ఇప్పుడిప్పుడే ఈతలు వేసి అర్రు వంచుతున్న వరి సైతం నేలకరుచకపోయింది. నేడో, రేపో కోత కోసే వరి పంట కూడ నేలవాలడంతో చేతికొచ్చిన పంట నేలపాలైందని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు. వరి ఎన్నులు నీటిలో నాని వరి గింజలు మొలకలు వచ్చి, రంగు మారి పనికి రాకుండా పోయే అవకాశం ఉందని వాపోతున్నారు. దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతామని కర్షకులు కంటనీరు పెడుతున్నారు. వాయుగుండంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిసి తల్లడిల్లుతున్నారు.

కాల్వ నీటితో నాట్లువేసిన పైరుకు ఎఫెక్ట్

సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల అనంతరం నార్లు పోసి నాట్లు వేసిన వరిపైరుకు సైతం తీవ్ర ఎఫెక్ట్‌గా మారింది. బోరు బావుల కింద ముందు నారు పోసిన రైతులు ఎడమకాల్వకు నీరు విడుదల చేయగానే నాట్లు వేశారు. కాల్వనీటితో నారువేసిన రైతులకు బోరుబావుల కింద వేసిన రైతులకు సుమారు 20 నుంచి 30 రోజులు తేడా ఉన్నప్పటికీ వర్షాలతో రెండు సమయాల్లో సాగు చేసిన పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. వెనుకగా నాటువేసిన వరి పొలాలు ఇప్పుడిప్పుడే ఈత వేస్తుండగా వర్షాలకు సుంకు రాలిపోయి, గింజ పాలు పోసుకోకుండా అందులోకి నీరు చేరి నల్లగా మారిపోయే అవకాశం ఉందని అంటున్నారు. దీనికి తోడు వరి కంకికి కాటుక పట్టి దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతుందని అంటున్నారు. ఈ సమయ ంలో గాలులతో నేలకొరిగితే ఒక్క గింజ కూడ చేతికందకుండా మట్టికొట్టుకపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెక్కల కష్టం నేలపాలైంది



ఆరుగాలం చెమటోడ్చిన కష్టం చేతికి అందకుండానే నేలపాలైంది. పచ్చివడ్లు కూడా కాకముందే గాలివానకు వరి చేను నేలవాలింది. నేల మీద నీటి తేమతో వరి కుళ్లిపోయి పంట కోసే పరిస్థితి కూడ ఉండదు. దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గి పెట్టుబడి వ్యయం కూడచేతికి రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుంది.

-అలుగుబెల్లి వెంకన్న రైతు, బెజ్జికల్

ఆప్ జిల్లా అధ్యక్షుడిగా అన్సారీ



రాష్ట్ర ఇన్‌చార్జితో ఆప్ నూతన కమిటీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్‌కేఆర్ అన్సారీ, అడ్వైజర్‌గా ఎండీ. కుత్బుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి రవీందర్, కోశాధికారిగా కీర్తి అశోక్‌ను నియమిస్తూ రాష్ట్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షుడిగా చేగొండి మహేందర్ ప్రసాద్‌యాదవ్, మహ్మద్ యూసుఫ్, కార్యదర్శులుగా నందిపాటి సైదులు, కన్నెబోయిన శ్రవణ్‌కుమార్‌లకు నూతన కార్యవర్గంలో చోటు దక్కింది. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పీవీ రావు, డాక్టర్ సైఫ్, సల్మాన్‌రాజు నియమితులయ్యారు. మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎండీ. కుత్బుద్దీన్, నకిరేకల్‌కు యారా శ్రీనివాస్, దేవరకొండకు సల్మాన్‌రాజ్, మునుగోడుకు దువ్వ నవీన్, సాగర్ నియోజకవర్గానికిమహేంద్రప్రసాద్ ఇన్‌చార్జీలుగా, మిర్యాలగూడ పట్టణ ఇన్‌చార్జిగా బెజవాడ ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను బరిలో నిలపడంతో పాటు రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృ షి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. తమ నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్, రాష్ట్ర ఇన్‌చార్జి ప్రియాంక, కోకన్వీనర్ సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి



గుర్రంపోడు : సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

గుర్రంపోడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా పక్కాగా రూపొందించడంలో బీఎల్‌వోల పాత్ర కీలకమని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌వోలు 2002 నాటి ఓటరు జాబితాకు ఇప్పటివరకు ఉన్న జాబితాతో సరిపోల్చి మరణించిన, వలస వెళ్లిన వారి పేర్లు తొలగించాలన్నారు. కొత్త ఓటర్లకు ఇప్పటికే ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నజీర్, హకీం, యాదగిరి, సందీప్, గోవర్ధన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయుడికి అభిషేకం

చింతపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామంలో హనుమాన్ మాల ధరించిన స్వాములు ఆంజనేయస్వామికి మంగళవార అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమంతుడికి సింధూరాభిషేకం చేసి సహస్రనామావళి పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఇన్సూరెన్స్ కంపెనీలు రైతులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాదూరి శశిధర్‌రెడ్డి

వేములపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):పంట నష్టపోయిన రైతులను ఇన్సూరెన్స్ కంపెనీలు పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రైతులకు రుణాలు ఇచ్చే సమయంలో బ్యాంకర్లు ఇన్సూరెన్స్‌ను కట్టించుకుంటున్నారని ఆయన అన్నారు. కాని విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంలో మాత్రం ఇన్సూరెన్స్ కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇన్సూరెన్స్ కట్టిన రైతులకు సర్వే నెంబర్ల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, వడ్డెగాని సైదులు, అనిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట రేనయ్య, గోపాల్, వెంకటేశ్వర్లు, బిక్షం పాల్గొన్నారు.

అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు : ఎస్ఐ

కొండమల్లేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : అమాయక ప్రజలు, చిరు వ్యాపారుల అవసరాలను ఆసరా చేసుకొని అధిక వడ్డీ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అజ్మీరారమేష్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. పట్టణంలో చిరు వ్యాపారులకు వందకు రూ.6 చొప్పున వడ్డీ ఇస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని అన్నారు. అధిక వడ్డీలకు ఇచ్చే వ్యాపారస్తులకు త్వరలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత కూడా మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల నుంచి అధిక వడ్డీ వ్యాపారస్తులు పట్టణ కేంద్రానికి వచ్చి అధిక వడ్డీకి అప్పు ఇచ్చి మంగళ, సోమవారాల్లో అప్పు వసూలు చేసుకొని పోతున్నారని, వారిపై చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

హరీ‌ష్‌రావు తండ్రి మృతికి సంతాపం

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీ‌ష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతికి బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ సంతాపం తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో సత్యనారాయణరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హరీ‌ష్‌రావును కలిసి సానుభూతి ప్రకటించారు.



హరీ‌ష్‌రావును కలిసి సంతాపం తెలుపుతున్న రవీంద్రకుమార్

దెబ్బతిన్న పంటల పరిశీలన

వేములపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 520 ఎకరాల్లో వరి నేలవాలినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు నేలవాలిన పంట పొలాలకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏవో కిశోర్‌నాయక్, ఏఈవోలు నితిన్, రమే‌ష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవో వంశీధర్‌ను సన్మానిస్తున్న కార్యదర్శులు

మాడ్గులపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన వంశీధర్‌ను మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం కలిసి శాలువాలతో సన్మానించారు. మండలాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు భాగస్వాములు ఎంపీడీవో వంశీధర్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సంగీత, కార్యదర్శులు నాగేందర్‌రెడ్డి, సతీ‌ష్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ మధు, నరే‌ష్‌రెడ్డి, కార్తీక్, షాకీరాబేగం, మల్లయ్య ఉన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం

● *ఎమ్మెల్యే బాలునాయక్*



జూబ్లీహిల్స్ ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థినవీన్‌యాదవ్ గెలుపుఖాయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో దేవరకొండ నియోజకవర్గ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే కాం గ్రెస్ అభ్యర్థి గెలుపునకు దోహదపడుతాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఒరిగింది ఏమిలేదని విమర్శించారు. 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు కూడ మంజూరు చేయలేదన్నారు. కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు సిరాజ్‌ఖాన్, శ్రీధర్‌రెడ్డి, రాంసింగ్, డాక్టర్ వేణుధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

● *సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి*



మాడ్గులపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

మాడ్గులపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏ ర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 336 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటివరకు కేవలం 186 కేంద్రాలను మాత్రమే ప్రారంభించారన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి తేమశాతం సరిగా ఉన్నప్పటికీ కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండడంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతుందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉ న్నందున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి తరలించాలని, అదేవిధంగా అకాల వర్షాలకు తడిసిన ధా న్యాన్ని సైతం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయ న డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ఎండీ.సలీం, దండంపల్లి సత్తయ్య, పుల్లెం ల శ్రీకర్, వెంకటాచారి, భీమగాని గణేష్, మాధవరెడ్డి, యాదయ్య, జానయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఆలయ బోర్డు డైరెక్టర్ కాశీనాథ్‌కు సన్మానం

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మాజీ సర్పంచ్ శ్రీశైలం దేవస్థాన బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన చిలువేరు కాశీనాథ్‌ను విశ్రాంత ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ కాశీనాథ్ దేవరకొండ సర్పంచ్‌గా పలు అభివృద్ధి పనులు చేశారని శ్రీశైలం దేవస్థాన బోర్డు డైరెక్టర్‌గా ఎన్ని ్నక కావడం మంచి పరిణామమని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహ, చంద్రమౌళి, బుచ్చయ్య, జగదీశ్వర్, వీరయ్య, పాండరయ్య, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



కాశీనాథ్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నేతలు

సీసీ రోడ్డు ధ్వంసం



ధ్వంసం చేసిన సీసీ రోడ్డు

కొండమల్లేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో నల్లగొండ రోడ్డులో నల్లకుంట కుంట కింది భాగంలోని కాలనీలో నీరు చేరింది. దీంతో వర్షపు నీరు పోయేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోకుండా ఆరు నెలల క్రితం దాదాపు రూ. 30 లక్షలతో వేసిన సీసీ రోడ్డును ఓ మాజీ ప్రజాప్రతినిధి ధ్వంసం చేశాడు. వర్షపు నీటిని కిందికి వదలడంతో రోడ్డు అవతలి పక్క ఉన్న ఇళ్లలో నీరు చేరుతుండడంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి తన స్వలాభం కోసం సీసీ రోడ్డును పగలగొట్టడం ఎంత వరకు సమంజసమని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోడ్డు ధ్వంసం చేయడంతో కింది భాగంలో ఉన్న ఇళ్లలో నీరు చేరుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దు



విద్యార్థులతో కలిసి నిరసన వక్తం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):: ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దని బీసీ విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలోమంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలలు పట్టాలు ఇవ్వడం లేదన్నారు. ఉన్నత, విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునే తరుణంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు బాండ్ పేపర్లు రాయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేయాలని, కళాశాలల యజమాన్యాలతో చర్చించి విద్యాసంస్థల బంద్‌ను విరమింపజేయాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు గాదగోని మహే‌ష్‌గౌడ్, అనంతనాగరాజ్, గణేష్, సురేష్, మహేందర్, పృథ్వీరాజ్, మల్లేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

దేవరకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని దేవరకొండ సీఐ వెంకట్ రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద మంగళవారం ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ నేతృత్వంలో 30 మంది కళాకారుల ఆధ్వర్యంలో 'ఎంజాయి పేరుతో గంజాయి' అనే అంశంపై బస్సు కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27 నుంచి నవంబరు 2 వరకు గంజాయిపై యువతకు కళాకారులు అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసువద్దన్నారు. 30 మంది కళాకారులచే జిల్లాలోని పలు మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో యువతకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు కళాకారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి బృందం పల్లె నరసింహ, కురిమిద్దె శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, సీపీఐ నాయకులు ఎండీ. మైనొద్దీన్, పల్లా రంగారెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, ఎస్.వెంకటేశ్వర్ రావు, జూలూరి జ్యోతిబస్, నూనె వెంకటేశ్వర్లు, మల్లేష్ పాల్గొన్నారు.

రైతుల్లో మొంథా గుబులు

(5వ పేజీ తరువాయి)


కోరుతున్నారు. ఈ మండలంలో 20 నుంచి 30 ఎకరాల్లో పత్తి నీట మునిగింది. నిడమనూరు మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు తోడు మొంథా తుఫాన్ తోడైంది. దీంతో పలు గ్రామాల్లో పొలాలు నేలకొరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మాడ్గులపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. వరి కోతలు పూర్తిచేసిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తుండగా, కొనుగోళ్లు సకాలంలో జరగడం లేదు.

మునుగోడు మండలంలో వర్షానికి వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల పత్తి పంటతో పాటు ధా న్యం రంగు మారింది. తిరుమలగిరి సాగర్ మండలంలో నాట్లు ఆలస్యంగా జరగడంతో ప్రస్తుతం పంట గింజ తయారై దశలో ఉండగా వర్షాలతో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని రైతు లు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే సుమారు 500 ఎకరాల్లో వరి నేలవాలింది.

నేలవాలిన వరిచేలు

(ఆంధ్రజ్యోతి, నాంపల్లి): నాంపల్లి మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేతికి వచ్చిన వరిచేలు నేలవాలుతున్నాయి. దీంతో పంట కింది భాగం మొలక, తాలు, రంగుమారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో వరి సాగుకాగా, అందులో 2,300 ఎకరాల్లో సన్నరకం ఉంది. వర్షాలకు మండలంలో 800 ఎకరాల్లో వరి దెబ్బతింది.

నాలుగెకరాలు నేలవాలింది



నేను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. గత 20 రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిచేలను నేలవాలింది. దీంతో పూర్తిగా నష్టపోయా. వరికి ఇప్పటి వరకు రూ.70వేల వరకు పెట్టుబడి పెట్టా. పంట నష్టపోయి అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

-రెవల్లి బాలయ్య, రైతు తుమ్మలపల్లి